క్లుప్తంగా...

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

శంషాబాద్: ఇటీవల ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డును స్వీకరించిన పట్టణవాసి మొయినుద్దీన్‌ను స్థానికులు గురువారం సన్మానించారు. శేరిలింగంపల్లి మండలం కొత్తగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఆయన ఉత్తమ ఉపాధ్యాయుడిగా బుధవారం అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులు ఆయనను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

వ్యాయామంతో మానసిక ఒత్తిడి దూరం



డా.మొహమ్మద్ వాసిఫ్ ఆజాం

అత్తాపూర్: మానసిక ఒత్తిడిని జయించేందుకు శారీరక వ్యాయామం చేయడంతో పాటు ఆహారపు అలవాట్లలో మార్పులు చేసుకోవాలని గుండె వైద్య నిపుణులు డాక్టర్ మొహమ్మద్ వాసిఫ్ ఆజాం అన్నారు. గురువారం ఆయన అత్తాపూర్‌లోని జర్మన్‌టెన్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ యాంత్రిక జీవనంలో విద్యార్థులు ఉద్యోగులు తీవ్రమైన మానసిక ఒత్తిడితో వ్యాధుల బారిన పడుతున్నారని తెలిపారు. మానసిక ప్రశాంతతతోనే వ్యాధుల నుంచి రక్షించుకోవచ్చన్నారు. జర్మన్‌టెన్ ఆసుపత్రిలో అత్యాధునిక పరికరాలు అందుబాటులో ఉన్నాయని సామాన్యులకు వైద్యం అందించేందుకు నిపుణులతో కూడిన వైద్య బృందం 24/7 అందుబాటులో ఉంటుందన్నారు.

దళితులపై దాడి అమానుషం



రాజేంద్రనగర్: దళితులను దేవాలయంలోకి రానివ్వకుండా అడ్డుకోవడమేగాకుండా దాడికి పాల్పడిన అగ్రవర్ణాల వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని రాజేంద్రనగర్ నియోజకవర్గ సీనియర్ దళిత నాయకుడు కోరని దయానంద్(డేవిడ్) అన్నారు. వట్టినాగులపల్లి గ్రామంలో జరిగిన బోడ్రాయి జాతర కార్యక్రమంలో దళితులకు ఆలయ ప్రవేశం లేదంటూ వారిపై అగ్రవర్ణాలు దాడికి పాల్పడటం దారుణమన్నారు. గురువారం రాజేంద్రనగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దళితులను 'మీరెవరూ బొడ్రాయి పండుగలో పాల్గొనవద్దు. మా దేవుళ్ల దగ్గరకు రావద్దు' అని అడ్డుకున్నారన్నారు. తాము ఎందుకు రావద్దని అడిగినందుకు వారిని కులం పేరుతో దూషించి దాడి చేశారన్నారు. బాధ్యులను తక్షణమే అరెస్టు చేయాలని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టాలని, లేని పక్షంలో ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో కమిటీ మాజీ అధ్యక్షులు పంబాల రాజు, దళితనాయకులు కెన్నీ, మైనార్టీ నాయకులు వాజీద్, సాధు, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు మహిళల అదృశ్యం



లలిత (ఫైల్)

శంషాబాద్: వేర్వేరు ప్రాంతాల్లో నివాసముంటున్న ఇద్దరు మహిళలు అదృశ్యమైన సంఘటన ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. రాళ్లగూడకు చెందిన పాల్మాకుల లింగం భార్య లలిత (27) ఈ నెల 1న ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటికి వెళ్లి తిరిగి రాలేదు. ఆమె కోసం గాలించినా ఆచూకీ తెలియకపోవడంతో కుటుంబసభ్యులు గురువారం ఆర్‌జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పుట్టింటికి వెళుతున్నానని చెప్పి..



వసంత (ఫైల్)

తల్లిగారింటికి వెళుతున్నానని చెప్పి వెళ్లిన ఓ మహిళ అదృశ్యమైన సంఘటన చోటు చేసుకుంది. పట్టణానికి చెందిన సుభాష్‌బ భార్య వసంత (45) గత నెల 9న జడ్చర్లలో ఉంటున్న తల్లిగారింటికి వెళ్లి వస్తానని చెప్పి వెళ్లింది. ఆమె తిరిగి రాకపోగా ఫోన్ స్విచ్చాఫ్ ఉండడంతో కుటుంబసభ్యులు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మనూలో ఆన్‌లైన్ లాంగ్వేజ్ డెవలప్‌మెంట్ ఎఫ్‌డీపీ

రాయదుర్గం: మనూలో అసిస్టెంట్ ప్రొఫెసర్లకు రెండు వారాల ఆన్‌లైన్ లాంగ్వేజ్ డెవలప్‌మెంట్ ఎఫ్‌డీపీ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని 'మనూ' సెంటర్ ఫర్ ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్ ఆఫ్ ఉర్దూ మీడియం టీచర్స్ (సీపీడీయూఎంటీ) డైరెక్టర్ ప్రొఫెసర్ మహ్మద్ అబ్దుల్ సమీ సిద్దిఖీ తెలిపారు.అక్టోబర్ 9 నుంచి 21వ తేదీ వరకు అసిస్టెంట్ ప్రొఫెసర్లలకు అడ్వాన్స్‌డ్ పెడగోగీస్‌పై రెండువారాల పాటు ఆన్‌లైన్ లాంగ్వే జ్ డెవలప్‌మెంట్ ఎఫ్‌డీపీ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో పాల్గొనే వారు మరిన్ని వివరాల కోసం సెంటర్ ఫ్యాకల్టీలు మిస్బాఅంజార్(9948412484), మహ్మద్ అక్బర్(8373984391)లో సంప్రదించాలని కోరారు.

ఊరూ వాడా సందడి

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

- రాధాకృష్ణుల వేషధారణలో అలరించిన చిన్నారులు
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు





మణికొండ: శ్రీకృష్ణాష్టమి వేడుకలు గురువారం గండిపేట మండల పరిధిలోని నార్సింగి, మణికొండ మున్సిపాలిటీల పరిధిలో ఘనంగా నిర్వహించారు. చిన్నారులు శ్రీ కృష్ణుడు, రాధ వేషాధారణతో అలరించారు. ఉట్లు కొట్టడం, రాధా కృష్ణుడు, గోపికల ఇతివృత్తంతో గోకులం ప్రదర్శనల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని మంచిరేవుల శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయంలో ఉదయం సహస్త్ర కలశాభిషేకం, కూచిపూడి నాట్య ప్రదర్శన, సాయంత్రం స్వామి వారి ఊంజల్ సేవ, స్వామి వారి ఊరేగింపు, ఉట్లు కొట్టడం కార్యక్రమాలను నిర్వహించారు. నార్సింగిలోని శ్రీ శారదా విద్యానికేతన్‌లో శ్రీ కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని అశోకా లివియానా గేటెడ్ కమ్యూనిటీలో సంబరాలు నిర్వహించారు.

బండ్లగూడలో..

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. చిన్నారులకు వారి తల్లిదండ్రులు శ్రీకృష్ణుడు, రాధా, గోపికలుగా ముస్తాబు చేశారు. వివిధ పాఠశాలల్లో నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకల్లో విద్యార్థులు సందడి చేశారు.

కోకాపేటలో..

మణికొండ: హరేకృష్ణ మూమెంట్ ఆధ్వర్యంలో నార్సింగి రెవెన్యూ పరిధిలో కోకాపేట రోడ్డులో నిర్మిస్తున్న హెరిటేజ్ టవర్ వద్ద మొదటి సారి శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. బేసిల్ ఊడ్స్ పాఠశాల విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, రాధా కృష్ణుల వేషాధారణతో అలరించారు. శ్రీల ప్రభుపాద 127వ వ్యాస పూజ ఉత్సవాలు, నందోత్సవం నిర్వహించారు.

రాజేంద్రనగర్‌లో.

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లోని పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రాజేంద్రనగర్, బుద్వేల్, కిషమ్మగుట్ట, శివరాంపల్లి తదితర ప్రాంతాల్లో సాయంత్రం ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక ప్రాంతాలకు చెందిన యువకులు పెద్ద ఎత్తున కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఉట్టి కొట్టిన యువకులను దేవాలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు.



అశోకా లివియానాలో..













నార్సింగి శ్రీ శారదా విద్యానికేతన్ పాఠశాలలో..









అలకాపూర్ తుల్జారాం దేవాలయంలో..



రాజేంద్రనగర్ వెంకటేశ్వర దేవాలయం వద్ద కృష్ణాష్టమి వేడుకలు

కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి



మాట్లాడుతున్న టీజేఎస్ అధినేత ప్రొఫెసర్ కోదండరాం

శంషాబాద్: తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అనంతరం కాంట్రాక్టు ఉద్యోగులందరినీ క్రమబద్ధీకరించి కాంట్రాక్టు అన్న పదం లేకుండా చేస్తానని చెప్పిన ముఖ్యమంత్రి కేసీఆర్ తన మాట నిలబెట్టుకోవాలని టీజేఎస్ అధినేత, ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. సమగ్ర శిక్ష అభియాన్ కాంట్రాక్టు ఉద్యోగులు గత నాలుగు రోజులుగా చేపడుతున్న నిరసన దీక్ష శిబిరాన్ని గురువారం ఆయన సందర్శించి సంఘీభావం తెలిపారు. రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ శాఖల్లో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా పనిచేస్తున్న వారందరినీ ఏకతాటిపైకి తీసుకొచ్చి హక్కుల సాధనకు పోరాటం చేస్తామన్నారు. రాజ్యాంగం ద్వారా సంక్రమించిన ఉద్యోగ భద్రత హక్కును ఏ ప్రభుత్వం కాదనడానికి వీలులేదన్నారు. వివిధ పనుల్లో కాంట్రాక్టర్లు రూ. కోట్లు దోచుకుంటున్నా పట్టించుకోని ప్రభుత్వం నిత్యం శ్రమిస్తూ ప్రభుత్వాన్ని నడిపిస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల డిమాండ్లను అమలు చేసేందుకు మొగ్గుచూపకపోవడం దారుణమన్నారు. సమగ్ర శిక్ష అభియాన్‌లో కాంట్రాక్టు పద్ధతిన పనిచేస్తున్న ఉద్యోగులను రోస్టర్, రిజర్వేషన్ పద్దతుల్లో అర్హతలను పరిశీలించి శాశ్వత ఉద్యోగులుగా నియమించాలన్నారు, ఎస్ఎస్ఏ కాంట్రాక్టు ఉద్యోగులను తక్షణమే రాష్ట్ర విద్యాశాఖలో విలీనం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ కాంట్రాక్టు ఉద్యోగుల జిల్లా అధ్యక్షుడు అజీజ్, సంపత్, సాయి, మజార్, కృష్ణ, రాజు, పద్మ, నాగరాణి, సంతోషి, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర ధరలను తగ్గించాలి



ఆరెమైసమ్మ చౌరస్తాలో రాస్తారోకో చేస్తున్న సీపీఎం నాయకులు

బండ్లగూడ: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిత్యావసర ధరలను పెంచుతూ పేదలపై భారం మోపుతోందని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జాన్‌వెస్లీ అన్నారు. గురువారం బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ ఆరెమైసమ్మ చౌరస్తాలో సీపీఎం ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిత్యావసర ధరలు పెంచుతూ ప్రజలపై భారాన్ని మోపుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా దేశవ్యాప్తంగా సీపీఎం ఆధ్వర్యంలో రాస్తారోకోలు, ధర్నాలు, నిరసన చేపడుతున్నట్లు తెలిపారు. నిత్యావసర ధరలను తగ్గించాలని, ఉపాధి, ఉద్యోగ అవకాశాలను కల్పించాలని, పన్నులను తగ్గించాలని, మతోన్మాదాన్ని నిర్మూలించాలని డిమాండ్ చేశారు. నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శ సభ్యులు డి.జగదీష్, గండిపేట మండలం కన్వీనర్ రుద్రకుమార్, ప్రవీణ్‌కుమార్, ఎం.ఆశోక్, లక్ష్మణ్‌కుమార్‌గౌడ్, వెంకటయ్య, ప్రసాద్, రాజు, రఘు, బలరాం, సురేష్, మహేష్‌యాదవ్, రవి వెంకటేష్, రవినాయక్, లక్ష్మణ్‌నాయక్, సలీం తదితరులు పాల్గొన్నారు.

శివరాంపల్లిలో భారీ అగ్ని ప్రమాదం...



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది



గోదాములో చెలరేగుతున్న మంటలు

రాజేంద్రనగర్: ప్రమాదవశాత్తు పిల్లలు ఆడుకునే ట్యూబ్స్ పరికరాల తయారీ కేంద్రంలో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. శివరాంపల్లిలో పిల్లర్ నెంబర్ 288 వద్ద ఉన్న ట్యూబ్స్ పరికరాల గోదాములో గురువారం తెల్లవారుజామున పెద్ద మంటలు రావడంతో స్థానికులు అప్రమత్తమై అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. గోదాం పరివాహక ప్రాంతంలోని రేకుల షెడ్డు కుప్ప కూలిపోయింది. షాట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగి ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు.

కంట్రీ చికెన్ అవుట్‌లెట్ ప్రారంభం



అవుట్‌లెట్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న మంత్రి హరీష్ రావు

అత్తాపూర్: ప్రపంచంలోనే మొదటి, భారతదేశంలో అత్యంత ప్రీమియం కంట్రీ చికెన్ బ్రాండ్ కంట్రీ చికెన్ కో ఐదో అవుట్‌లెట్‌ను అత్తాపూర్‌లో తెలంగాణ రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీష్ రావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నాటు కోడి ఆరోగ్యానికి మంచిదన్నారు. రుచిలో నాటు కోడికి మించింది మరేది లేదన్నారు. కంట్రీ చికెన్ బ్రాండ్ మరింతగా విస్తరించాలని ఆకాంక్షించారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ నాటు కోళ్లు హైదరాబాద్‌లో దొరకడం గగనమవుతున్న తరుణంలో అవుట్‌లెట్‌ను ప్రారంభించడం అభినందనీయమన్నారు. కంట్రీ చికెన్ ఫౌండర్, సీఈవో జి.సాయికేష్ గౌడ్ మాట్లాడుతూ ఒకటిన్నర సంవత్సరాల పాటు సాగిన తమ ప్రయాణంలో కంట్రీ చికెన్ కో హైదరాబాద్‌లో ఓ సంచలనంగా పేర్కొన్నారు.

యువకుడిపై కత్తితో దాడి

రాజేంద్రనగర్: వివాహేతర సంబంధం కారణంగా ఓ యువకుడు మరో యువకుడిపై కత్తితో దాడి చేసిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. రాజేంద్రనగర్ గాంధీనగర్ ప్రాంతానికి చెందిన నర్సింహ, బాలరాజు దూరపు బంధువులు, నర్సింహ భార్యతో బాలరాజు గత కొంతకాలంగా వివాహేతర సంబంధాన్ని కొనసాగిస్తున్నాడు. ఈ విషయం తెలిసిన నర్సింహ బాలరాజును పలుమార్లు హెచ్చరించాడు. అయినా అతను తన వైఖరి మార్చుకోకపోవడంతో గురువారం ఉదయం పనికి వెళ్తున్న బాలరాజును అడ్డుకున్న నర్సింహ అతడిపై కత్తితో దాడికి దిగాడు. తీవ్రంగా గాయపడిన బాలరాజును పోలీసులు ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెత్తను ఎత్తేశారు..



చెత్తను తొలగిస్తున్న జీహెచ్‌ఎంసీ సిబ్బంది

మైలార్‌దేవ్‌పల్లి: మధుబన్ కాలనీ ఎర్రకుంట ప్రధాన రహదారిపై చెత్త పేరుకు పోవడంపై 'సాక్షి' దినపత్రిక గురువారం 'మురికి కూపంగా ప్రధాన రహదారి' శీర్షికన ప్రచురితమైన కథనంపై స్పందించిన మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు టి.ప్రేమ్‌గౌడ్ స్థానికులతో కలిసి ఆ ప్రాంతంలో పర్యటించారు. సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో జీహెచ్ ఎంసీ సిబ్బంది గురువారం ఉదయం ఎర్రకుంట ప్రధాన రహదారిపై జేసీబీ సహాయంతో ప్లాస్టిక్ వ్యర్థాలను శుభ్రం చేయించారు. వ్యర్థాల కారణంగానే దుర్వాసన వస్తున్నదని , చెత్తను రోడ్లపై వేయకుండా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.



పనులను పరిశీలిస్తున్న మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు టి.ప్రేమ్‌గౌడ్

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం ఖాయం



బండ్లగూడలో పాదయాత్ర చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నేతలు

బండ్లగూడ: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే ప్రజల సమస్యలు పరిష్కారమవుతాయని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పూలపల్లి కృష్ణారెడ్డి అన్నారు. రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రం సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా ఏఐసీసీ, టీపీసీసీ ఆదేశాల మేరకు కార్పొరేషన్ పరిధిలో కాంగ్రెస్ నాయకులు పాదయాత్ర నిర్వహించారు. మీ సందర్భంగా పూలపల్లి కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రజా వ్యతిరేఖ విధానాలు అవలంభిస్తున్న బీఆర్‌ఎస్‌కు ప్రజలు బుద్ధి చెప్పే రోజులు దగ్గరలో ఉన్నాయన్నారు. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్‌ఎస్‌లను ప్రజలు నమ్మడం లేదన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు తలారీ ప్రేమ్‌కుమార్, ఏ-బ్లాక్ అధ్యక్షులు డప్పు నవీన్‌కుమార్, బీసీ సెల్ అధ్యక్షులు అంకం శ్రీనివాస్, సుధాకర్, చింటూరెడ్డి, బోగాల శ్రీనివాస్, విష్ణు, రవికాంత్‌రెడ్డి, లక్ష్మణ్, శ్రీనివాస్‌ముదిరాజ్, బాలరాజు, కిట్టయ్య ముదిరాజ్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

భారత్ జోడో ఏడాది సంబురం

శంషాబాద్: భారత్ జోడో యాత్రకు ఏడాది పూర్తయిన సందర్భంగా గురువారం కాంగ్రెస్ నేతలు సంబరాలు నిర్వహించారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాహుల్‌గాంధీ చేపట్టిన పాదయాత్రతో దేశంలో కాంగ్రెస్ బలోపేతమైందన్నారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో, దేశంలో కాంగ్రెస్ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పీసీసీ నాయకులు బి. జ్ఞానేశ్వర్ ముదిరాజ్, పట్టణ అధ్యక్షుడు పి. సంజయాదవ్, సీనియర్ మహిళా నాయకురాలు మైలారం సులోచన, పీసీసీ ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు జల్లపల్లి నరేందర్ తదితరులు పాల్గొన్నారు.